క్లుప్తంగా

దేవాలయ స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక – లచ్చపేట దారిలో వీరాంజనేయ స్వామి దేవాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కొంత మంది కబ్జాదారులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దుబ్బాక తహసీల్దార్ వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ జిల్లా అధికారిక ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడారు. వీరాంజనేయ స్వామి దేవాలయం పేరిట 1359 సర్వే నంబర్లో ఉన్న 1.39 గుంటల స్థలాన్ని కబ్జాదారులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సరికాదన్నారు. ఈ విషయాన్ని త్వరలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల దేవేందర్, సురేష్, గోపి , తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి



చేర్యాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని 1వ వార్డులో పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, 5వ వార్డు కౌన్సిలర్ నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వర్దరాజుల స్వామి రథోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని వర్దరాజ్‌పూర్ గ్రామ వర్దరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. స్వామివారికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కోడలు క్షమిత పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సహెరా నరేష్, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్, స్వరూప, మాధవి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బాల్‌రాజు తదతరులు పాల్గొన్నారు.

ఆరుద్ర మెరుపు



పొలాల్లో తిరుగుతున్న ఆరుద్ర పురుగులు

కోహెడరూరల్(హుస్నాబాద్): వర్షాకాలంలో గుర్తుకొచ్చేది ఆరుద్ర పురుగులే. వాతావరణం చల్లబడి, తొలకరి జల్లులు పడిన నేలపై ఇవి ఎర్రని బొట్లుగా మెరుస్తూ కనిపిస్తాయి. మృగశిర, ఆరుద్ర కార్తెలోనే ఇవి నేలపై తిరుగుతూ సందడి చేస్తుంటాయి. కోహెడ మండలంలోని రాంచంద్రపూర్ గ్రామ శివారులో ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో కనిపించాయి. ఆరుద్ర పురుగులు కనిపించాయంటే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతుల నమ్మకం.

గజవాహనంపై వేణుగోపాలుడు



వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీవేణుగోపాల స్వామివారి గజవాహనోత్సవ సేవ నేత్రపర్వంగా జరిగింది. శ్రీరుక్మిణీ, సత్యభామ సమేతులైన స్వామివారి గజవాహనం అధిష్ఠించి పురవీధులలో ఊరేగారు.

విత్తనాల ఎంపికపై అవగాహన



కొండపాకలో విత్తనాల కొనుగోలు, సాగు మెలకువలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రియదర్శిని

గజ్వేల్‌రూరల్: పంటల సాగుకోసం విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడకండ్ల, శ్రీగిరిపల్లి గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలు జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈవోలు గణేష్, నర్సింహులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదులను తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని అన్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని వెలికట్ట, రాంపల్లి, విశ్వనాథపల్లి, ముద్దాపూర్, బొబ్బాయిపల్లి గ్రామాల్లోని రైతు వేదికల్లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వానాకాలం సాగులో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగవుతాయన్నారు. పంటల సాగును ఆసరా చేసుకొని కొంతమంది ఎరువుల దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశముంటుందన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.

రోహిణీ కార్తె ప్రారంభంతో..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో శనివారం వ్యవసాయ అధికారులు విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో రైతులు సాగు పనులు ప్రారంభిస్తారని, ప్రభుత్వం నిర్దేశించిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏఈఓ ప్రణీత చెప్పారు. దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రసీదు తీసుకోవాలన్నారు.

ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాలు..

చిన్నకోడూరు(సిద్దిపేట): విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని ఏఓ జయంత్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ప్యాకింగ్, సీల్, లేబుల్, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.

విత్తన కొనుగోలు జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): వానాకాలం సాగుకు విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని లద్నూరు గ్రామంలో రైతులకు విత్తనాల కొనుగోలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడి విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈవో అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల పట్ల ..

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంతో పాటు మండలంలోని గుగ్గిల్ల, నర్సింహులపల్లె, తలారివానిపల్లె, కల్లేపల్లి గ్రామాల్లో శనివారం పంటల సాగు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఓ సంతోష్ మాట్లాడుతూ రైతులు వరికొయ్యలు కాల్చకుండా పొలంలో కలియదున్నాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పంట పూర్తయ్యేవరకు దాచుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): పంట కాలం పూర్తయ్యే వరకు విత్తన కవర్, కొనుగోలు బిల్లును రైతులు భద్ర పరుచుకుంటే పంట నష్టం జరిగితే చర్యలు తీసుకోవచ్చని ఏఓ గీత అన్నారు. శనివారం నంగునూరు మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలో రైతులకు విత్తన కొనుగోలుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అధీకృత డీలర్ల వద్ద..

మర్కూక్(గజ్వేల్): వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల ఏఈఓలు రజినీకాంత్, భానుశ్రీ, విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని దామరకుంట, మర్కూక్, అంగడికిష్టాపూర్, వర్దరాజ్‌పూర్ గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేయొద్దని, ప్యాక్ చేసినవి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

రశీదులు భద్ర పరచుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ వసంతరావు అన్నారు. శనివారం మండలంలోని పది గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు రశీదులను భద్ర పరచుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

29వ తేదీ వరకు గడువు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ యత్నం
- ఎవరికి వారు క్యాంపు రాజకీయాలు



కొండపాక మండల సమీకృత ఎంపీడీఓ కార్యాలయం

కొండపాక(గజ్వేల్): ఎట్టకేలకు కొండపాక ఎంపీపీ పదవి ఎంపిక కోసం నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈనెల 29న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ధ్రువీకరించారు. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల అనంతరం బందారం గ్రామానికి చెందిన ర్యాగల్ల సుగుణ పరోక్ష ఎన్నిక ద్వారా ఎంపీపీ పదవి దక్కించుకుంది. ఉమ్మడి కొండపాక మండలంలో 14 మంది ఎంపీటీసీలున్నారు. కుకునూరుపల్లి ఎంపీటీసీ 2 రెడ్డమైన గీత అనారోగ్యంతో మృతి చెందింది. ఈక్రమంలో ఎంపీపీపై మార్చి 5వ తేదీన 9 మంది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తీర్మాన కాపీని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేశారు. దీంతో మార్చి 28వ తేదీ అవిశ్వాస తీర్మాన ఎన్నిక సమావేశానికి గడువు పెట్టారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఎంపీపీ పదవి ఖాళీ అయిన సంగతి పాఠకులకు తెలిసిందే. దీంతో ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయింది. ఈసీ ఉత్తర్వుల ప్రకారం 29న ఎంపీపీ ఎన్నికకు గడువు విధించారు. ఆ రోజు మెజారిటీ కోరం లేకపోతే 30వ తేదీన నిర్వహించేలా వెసులుబాటు కల్పించారు. కాగా ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు అయ్యింది. 13 మంది ఎంపీటీసీల్లో ర్యాగల్ల సుగుణ, మంచాల అనసూయకు అవకాశం ఉంది. మంచాల అనసూయ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో పోటీ నెలకొంది. ఎంపీపీ పదవి దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీటీసీలను క్యాంపులకు తీసుకెళ్లారు. ఎంపీటీసీల పదవీ కాలం మరో నెలలో ముగియనుంది.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రాకేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, మాజీ సర్పంచ్ సుందరగిరి ప్రవంతి, కృష్ణవేణి, మండల ఉపాధ్యక్షుడు సుమన్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్య పరిష్కారం

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 27న జరిగే వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు ఏనుగుల రాకేష్‌రెడ్డికి వేసి గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య కోరారు. శనివారం పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రాకేష్‌రెడ్డిని గెలిపిస్తేనే నిరుద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్: నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి హెచ్చరించారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో సీఐ సైదాతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేయాలని చూసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విత్తనాల కొనుగోలు చేసిన రైతులకు రశీదు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో విడి విత్తనాలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, కాలం చెల్లిన విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

కాలం చెల్లిన విత్తనాలు స్వాధీనం

పట్టణంలోని లక్ష్మీ బాలాజీ, పవనసుత, శ్రీసాయి ఫర్టిలైజర్ దుకాణాల్లో చేపట్టిన తనిఖీల్లో కాలం చెల్లిన బీర్నీసు, గంగవాయిలు కూర విత్తనాలు, మెంతులు, వరి ధాన్యం విత్తనాలతో పాటు పురుగు మందులు సీజ్ చేశారు. 610 కిలోల విత్తనాలను గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజులకు అప్పగించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్ తదితర రికార్డులను తనిఖీ చేశారు.

విత్తన దుకాణం తనిఖీ

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను శనివారం రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. విత్తనాల ప్యాకెట్లు, వాటి కాలపరిమితి, కంపెనీ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులు, పోలీసులకు రైతులు ఫిర్యాదు చేయాలన్నారు.



గజ్వేల్‌లో దుకాణదారుడితో మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

కలెక్టర్‌ను కలిసిన గురునానక్ ట్రస్ట్ ధర్మకర్తలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రస్ట్ ధర్మకర్తలు

సిద్దిపేటరూరల్: ములుగు మండలం వంటిమామిడికి చెందిన గురునానక్ మిషన్ ట్రస్ట్ ధర్మకర్తలు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రస్ట్ కార్యకలాపాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సర్దార్ హర్‌ప్రీత్ సింగ్, సర్దార్ రణబీర్ సింగ్, సర్దార్ సురేందర్ అరోరా, సర్దార్ గుర్మీత్ సింగ్, సర్దార్ చాబ్రా రంజిత్ సింగ్, సర్దార్ మంజీత్ సింగ్ గాంధీ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

హుస్నాబాద్ ఏసీపీ సతీష్



మాట్లాడుతున్న ఏసీపీ సతీష్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల సర్కిల్ పరిధిలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల పరిధిలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ అన్నారు. శనివారం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల సర్కిల్ పరిధిలోని నాలుగు మండల కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఉపఎన్నికకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల సామగ్రి రక్షణ బాధ్యత రూట్ మొబైల్ అధికారులదేనన్నారు. రూట్ మొబైల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద 24 గంటలు పెట్రోలింగ్ చేయాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐలు దామోదర్, యూనస్ అహ్మద్ అలీ, మహేష్, వివేక్, తిరుపతి, రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: గ్రామస్తులు ఐకమత్యంతో ఉంటూ గుర్రాలగొంది గ్రామాన్ని అభివృద్ధి చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లిదయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. ఆలయానికి అన్నివిధాలా సహకారం అందించానని, భవిష్యత్ లో మరింత సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాం అందజేయాలి



గజ్వేల్‌లో యూనిఫాంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్‌రూరల్: పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫాం అందించేలా చర్యలు తీసుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య ఆదేశించారు. పట్టణంలోని మంజీరా దీపిక స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. దుబ్బాక, దౌల్తాబాద్, తొగుట మండలాలకు చెందిన యూనిఫాం తయారీ విధానాన్ని సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాంను జూన్ 5లోగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీవో సరిత పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకి సీపీఎం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 27వ తేదీన జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులు ఆలోచించి మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో, జిల్లా కమిటీ సభ్యుడు బండకింది అరుణ్‌కుమార్, మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, దూల్మిట్ట మండల బాధ్యులు చొప్పరి రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుస్నాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ దుర్గా శ్రీనివాస్ తెలిపారు. పందిల్ల, ధర్మారం, రామవరం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వాహనం స్వాధీనం

సిద్దిపేటకమాన్: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ప్రభుత్వ అనుమతి లేకుండా గడీల కనకయ్య, డ్రైవర్ దున్నపోతుల భాస్కర్ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అకాల వర్షంతో అంతరాయం



మాచాపూర్ రోడ్డుపై పడిపోయిన చెట్టు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో శనివారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోడ్లపై చెట్లు కూలిపోయాయి. వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిన్నకోడూరు – మాచాపూర్ రోడ్డులో చెట్లు రోడ్డుపై పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1991–92లో 7వ తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శనివారం గ్రామంలోని కేడిక సత్తెమ్మ–రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు లక్కిడి రాంరెడ్డి, చాడగొండ ధర్మారెడ్డి, రాజు, నిమ్మ సుధాకర్‌రెడ్డి, సరస్వతిని ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ వివరాల కోసం దరఖాస్తు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని స్టేడియం నిర్వహణకు జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్ల లో ఇచ్చిన నిధుల వివరాలు ఇవ్వాలని సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. శనివారం జిల్లా డీఎస్‌వైఓ కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినూత్న రీతిలో దరఖాస్తు ఇచ్చారు.

◆ హనుమాన్ శోభాయాత్ర

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో కొందరు హనుమాన్ దీక్ష తీసుకున్నారు. శనివారం ఈ స్వాములు గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా స్వామి వారికి పూజలు చేశారు.

◆ ఆకట్టుకున్న బీరప్ప నృత్యాలు

హుస్నాబాద్: పట్టణంలోని ఆరేపల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కామరతి అక్క మహంకాళి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులు గంగ బోనం, వీర గ్రంథాలు, లింగాలు తీయుటకు ఆరేపల్లి నుంచి ఎల్లమ్మ చెరువు వరకు ర్యాలీగా వీర ఖడ్గాలు వేసుకుంటూ వెళ్లారు. బీరప్ప నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎల్లమ్మ చెరువు వద్ద బీరప్ప కామరతికి మొక్కులు చెల్లించినట్లు కురుమ సంఘం సభ్యులు తెలిపారు.

◆ పండ్ల మొక్కల పెంపకంతో లాభాలు

బెజ్జంకి(సిద్దిపేట): పండ్ల మొక్కల పెంపకంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఎంపీడీఓ లక్ష్మప్ప శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పండ్ల తోటల పెంపకానికి సన్నకారు, చిన్నకారు రైతులకు కందకాలు తవ్వడానికి, రెండేళ్ల నిర్వహణ ఖర్చు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, జాబ్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌తో ఆయా గ్రామాల కార్యదర్శులు లేదా పీఓకు అందజేయాలన్నారు.

◆ యువకుడి అనుమానాస్పద మృతి

మర్కూక్ (గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మర్కూక్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. మర్కూక్‌కు చెందిన నీలం రమేశ్(35) శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రైతులు పొలాల వద్దకు వెళ్తుండగా కొండ పోచమ్మ సాగర్ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు నీలం రమేశ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ గంజాయి విక్రేత అరెస్ట్

వర్గల్(గజ్వేల్): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మండలంలోని గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరారం బస్టాండ్ వద్ద గంజాయి విక్రయించేందుకు ఓ వ్యక్తి బస్సులో వస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అప్రమత్తమై పోలీసులు గౌరారం బస్‌స్టాప్ వద్ద నిఘా వేయగా అనుమానాస్పద స్థితిలో హైదరాబాద్‌లోని ధూల్‌పేట, మంగళహాట్‌కు చెందిన ఉమేష్ సింగ్(35) పేపర్‌బ్యాగ్‌తో కన్పించాడు. తనిఖీ చేయగా 30 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా కొంత కాలంగా హైదరాబాద్‌లో గంజాయిని కొని ఇతరులకు అమ్ముతున్నట్లు తెలిపాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుని రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఓర్వలేక అసత్య ఆరోపణలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కొందరు పార్టీ నాయకులే హరికృష్ణ నాయకత్వంలో పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.